నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్ : హెచ్ఎంటీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ నందమూరి నగర్ ఫీడర్‌లోని హోలిస్టిక్ హస్పిటల్, నిజాంపేట్ ప్రధాన రహదారి, 11కేవీ బృందావన్ కాలనీ ఫీడర్‌లో బృందావన్ కాలనీ, హైదర్‌నగర్ గ్రామం 11కేవీ 7 హిల్స్ ఫీడర్‌లో నాగార్జున హోమ్స్, 7 హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆసుపత్రి వద్ద నిత్య అల్పాహారం


నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద అల్పాహారం పంపిణీ చేస్తున్న సభ్యులు

కుత్బుల్లాపూర్ : లయన్స్ క్లబ్ జీడిమెట్ల నార్త్ ఆధ్వర్యంలో సూరారం నారాయణ ఆసుపత్రి వద్ద రోగులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. ఆదివారం నాటికి 1500 రోజులు పూర్తి చేసుకుంది. గతంలో ఒక్కరిద్దరితో ప్రారంభమైన ఈ క్లబ్‌లో 400 మంది పైగా సభ్యులు చేరారు. ఆ సభ్యుల కుటుంబాల్లో పుట్టినరోజు, పెళ్లిరోజు, పదవీ విరమణ సందర్భంగా ప్రతిరోజు ఉదయం 8 గంటలకు సూరారంలోని నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద బాటసారులకు, రోగులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డిని ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

108 సూర్య నమస్కారాలు


ఏపీఎస్ కాలనీ పార్కులో సూర్య నమస్కారాలు చేస్తున్న సాధకులు

కుత్బుల్లాపూర్: సూరారం డివిజన్ ఏపీఎస్ కాలనీలో పార్కులో ఆదివారం జరిగిన యోగా క్లాస్‌లో రథసప్తమి సందర్భంగా 108 సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రమశక్తి అవార్డు గ్రహీత మదన్‌గౌడ్ మాట్లాడుతూ.. సూర్యుడు ఉదయించక ముందు నిద్రలేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటామన్నారు. సూర్య కిరణాల నుంచి మనకు డి విటమిన్ లభిస్తుందన్నారు. ప్రతిరోజు యోగా, సూర్య నమస్కారాలు చేయడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీ ఆఫీస్ మోసెస్, వెంకట్ శర్మ, యోగా మాస్టర్ మల్లేష్, పూర్ణ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

- వివిధ కంపెనీలకు వంద మంది ఎంపిక


మాట్లాడుతున్న జేకే శేఖర్‌యాదవ్

చింతల్: సామాజికవేత్తలు ఆదిత్య కోడి, ఉదయ్ గంజి ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ నగర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళా జరిగింది. ఈ జాబ్‌మేళాకు 350 మంది యువత హాజరు కాగా 100 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ముున్ముందు మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గరిగె శేఖర్, రాజా సదానందం, భాను చందర్ వర్మ, పులి బలరామ్, శ్రీనివాస్‌రెడ్డి, కామ్రేడ్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

జీడిమెట్ల: ఆల్ ఇండియా సిక్లిగర్ సిక్కు సంగతన్ సెక్రటరీగా ఎన్నికైన హరిదేవ్‌సింగ్, స్పీకర్ గుండాసింగ్‌ను గురుద్వారా కమిటీ సభ్యులు సత్కరించారు. సుభాష్‌నగర్‌లోని గురుద్వారా వద్ద వారిద్దరిని ఆహ్వానించి ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్నంగి కిరణ్‌రెడ్డి, పల్లాసింగ్, రతన్‌సింగ్, కరణ్‌సింగ్, దిలీప్‌సింగ్, నానక్‌సింగ్, అర్జున్‌సింగ్ పాల్గొన్నారు.

ఏపీహెచ్‌బీ కాలనీలో..



పట్వారీ ఎన్‌క్లేవ్ రోడ్డులో..



స్టార్ హోమ్స్ అపార్ట్‌మెంట్స్ కాలనీలో..



ప్రమాదాలకు నిలయంగా స్పీడ్ బ్రేకర్లు!

- అనుమతులు లేకుండా ఏర్పాటు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- మార్కింగ్ లేకుండా ఎత్తు ఉండటంతో వాహనదారులకు తిప్పలు

చింతల్: ఓ బడా సంస్థ తీరుతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అనుమతులు లేకుండా ఆయా కాలనీలు, బస్తీలలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లపై అధికారుల నిఘా కొరవడంతో ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లను నిర్మిస్తూ ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నారు. చింతల్ డివిజన్ స్టార్ హోమ్స్ విలాస్ అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లే దారిలో సుమారు 18 వరకు స్పీడ్ బ్రేకర్లను నిర్మించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ విభాగాల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా స్పీడ్ బ్రేకర్లు వేయడంతో ఆ రోడ్డు నుంచి స్టార్ హోమ్స్ విల్లా అపార్ట్‌మెంట్స్ వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్లను పరిమితికి మించి అధికంగా ఎత్తు, వెడల్పు చేసి నిర్మాణం చేయడంతో కార్లకు కింది భాగం తగిలి కార్ల యజమానులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎంటీఏఆర్ కంపెనీ నుంచి ప్రారంభమై స్టార్ హోమ్స్ విల్లా అపార్ట్‌మెంట్ చివరి గల్లి వరకు సుమారు 17 ప్లాస్టిక్, సిమెంట్‌తో స్పీడ్ బ్రేకర్లను అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారు. ఈ స్పీడ్ బ్రేకర్లపై ఎటువంటి మార్కింగులు ఏర్పాటు చేయకపోవడంతో వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

స్టార్ హోమ్స్ విల్లా అపార్ట్‌మెంట్స్‌తో పాటు పట్వారి ఎన్‌క్లేవ్, తెలంగాణ స్పిన్నింగ్ మిల్స్, ఏపీహెచ్బీ కాలనీ తదితర కాలనీలలో స్థానిక ఇళ్లవాసులు కలిసి ఇష్టరాజ్యంగా స్పీడ్ బ్రేకర్లను నిర్మించారు. ప్రమాదాలకు గురి అవుతున్నప్పటికీ వీటిపై నియంత్రణ చేపట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. రబ్బరు స్పీడ్ బ్రేకర్లకు సైతం జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వారు ఇష్టానుసారంగా వేశారు. ఇదే విషయమై అధికారులను వివరణ కోరగా.. ప్రతి స్పీడ్ బ్రేకర్‌కు జీహెచ్ఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలని, తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడ స్పీడ్ బ్రేకర్లను వేయాల్సి వస్తే తామే వేస్తామని అన్నారు. కానీ ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా మారింది.


కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయ రోడ్డులో..

ప్రమాదాల బారిన పడుతున్నాం

స్టార్ హోమ్స్ విల్లాస్ వెళ్లే దారిలో ఇష్టానుసారంగా ఎత్తు, వెడల్పులతో స్పీడ్ బ్రేకర్లు వేశారు. అనేకమార్లు తాము ప్రమాదాల బారిన పడ్డాం. స్పీడ్ బ్రేకర్లపై ఎటువంటి మార్కింగ్ చేయకపోవడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు సైకిళ్లపై వెళ్లే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అనుమతులు లేకుండా వేసిన స్పీడ్ బ్రేకర్లను వెంటనే తొలగించాలి.

- అల్లా ప్రకాష్, తులీప్ అపార్ట్‌మెంట్స్

పరిశీలించి బ్రేకర్లను తొలగిస్తాం

స్టార్ హోమ్స్ వెళ్లే దారిలో అదేవిధంగా చింతల్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అక్రమ స్పీడ్ బ్రేకర్ల విషయమై పలువురు ఇటీవలే ఫిర్యాదు చేశారు. త్వరలోనే వాటిని పరిశీలించి అనుమతులు లేని స్పీడ్ బ్రేకర్లను తొలగిస్తాం.

- నాగరాజు సైట్ ఇంజినీర్ చింతల్ డివిజన్

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌తో కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో గాజులరామారం బాలాజీ లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, అంజన్న, వెంకట్, శ్రీనివాసులు, కాలనీ వాసులు వేణు, రాజు, సుకుమార్, విజయారెడ్డి, కిషోర్ కుమార్, ప్రదీప్, చైతన్య, ఇంద్రాసేనరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా విభాగం డివిజన్ అధ్యక్షురాలిగా నాగరాణి

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి ప్రణవ్ గౌడ్ ఆదేశాల మేరకు వివేకానందనగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పిల్లి నాగరాణిని నియమించారు. ఆదివారం గాంధీ భవన్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విద్య కల్పన ఏకాంత్ గౌడ్, శ్రీదేవి, స్వప్న గౌడ్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి


నిత్యావసర సరుకులు అందజేస్తున్న అల్లూరి ఫౌండేషన్ సభ్యులు

జీడిమెట్ల: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ అధ్యక్షుడు సత్తిబాబు అన్నారు. బహదూర్‌పల్లికి చెందిన శ్రీనివాస్‌చారి జీడిమెట్లలోని ఓ ఫ్యాక్టరీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఇటీవల శ్రీనివాస్‌చారికి డయాబెటిస్ రాగా అతని రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. దీనికితోడు అతని భార్యకు మెదడులో బ్లడ్‌క్లాట్‌లు వచ్చాయి. విషయం తెలుసుకున్న అల్లూరి ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్‌చారి ఇంటికి వెళ్లి రూ.5 వేల విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జంగాతా తాజీ, నాగరాజు, చిన్నబాబు, నరసింహ, గణపతి, నిఖిల్, చేతన్, అశ్విన్ పాల్గొన్నారు.

అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీలు

కూకట్‌పల్లి: విశ్వం ఎడ్యుటెక్ 18 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు, ఇంగ్లిష్ స్పెల్ బి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో రాష్ట్ర స్థాయి పోటీలను కూకట్‌పల్లి పీఎస్ఎం స్కూల్‌లో ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు వివిధ జిల్లాల నుంచి 595 పాఠశాలలకు చెందిన 936 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యార్థులు 18 కేటగిరిల్లో పోటీ పడి 54 మంది విజేతలుగా ఎంపికయ్యారు. విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని విశ్వం ఎడ్యుటెక్ సీఈఓ హరిచరణ్ తెలిపారు. ముఖ్య అతిథిగా డా. మధు వారణాసి హాజరై మాట్లాడారు.

చెరువును సంరక్షించాలని నిరసన


ప్లకార్డులతో చెరువు కట్టపై ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

నిజాంపేట్ : ప్రగతినగర్‌లో ఆదివారం స్థానికులు సేవ్ అంబీర్ లేక్ అంటూ కట్టపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 1995వ సంవత్సరంలో ఈ చెరువులో నిలబడి తీసుకున్న ఒక ఫొటోలో మోకాలిలోతు నీళ్లలో కూడా అడుగున ఉన్న మట్టి కనిపించేదన్నారు. అటువంటిది ఇప్పుడు పూర్తిగా చెరువు కాలుష్య కాసారమైందన్నారు. చెరువు చుట్టుపక్కల కూడా జీవులు బతకలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: గాజుల రామారంలోని మహాదేవపురం కాలనీలోని మతా యోగా అన్నపూర్ణేశ్వరి 25వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ గాంధీ ఆదివారం పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దేశాల్, నాయినేని చంద్రకాంత్‌రావు, పరమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అగచాట్లు

రంగారెడ్డినగర్: నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులోని బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడ, షాపూర్‌నగర్, కళావతినగర్, న్యూషాపూర్‌నగర్, హెచ్ఏఎల్ కాలనీ, షాపూర్‌నగర్ మార్కెట్, సుభాష్‌నగర్ పైపులైన్‌రోడ్డు తదితర ప్రాంతాల వాసులు ఈ బస్టాప్ నుండే నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. జీహెచ్ఎంసీ అధికారులు బస్‌షెల్టర్‌ను తొలగించడంతో ఎండలో నిలబడలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు నిలువ నీడ లేకపోవడంతో పక్కనే ఉన్న ఓ టీస్టాల్ షెడ్డులో నిలుచుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మూసాపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎర్రగడ్డకు చెందిన మచ్చాల రాజశేఖర్(39) ఐడీఎల్ చెరువుపై హానర్స్ భవన నిర్మాణ సంస్థ కార్యాలయం ముందు రోడ్డుపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006–07 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులంతా ఒక చోటకు చేరి తమ పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు శంకర్ రెడ్డి, రామచంద్రం, గోపాలకృష్ణ, ఆశ రాణి, మోహన్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: షాపూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2000 –2001 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అందరూ ఒకే వేదిక ద్వారా కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

7న హైదరాబాద్‌లో జరిగే ప్రదర్శనను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు రాసమల్ల యాదగిరిమాదిగ డిమాండ్ చేశారు. ఈ నెల 7న మందకృష్ణమాదిగ తలపెట్టిన చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆదివారం సూరారంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాలు ప్రతి ఇంటి నుంచి ఒక డప్పు వేసుకొని రావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ చేపడతామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో దళిత నాయకుడు విజయభాస్కర్ రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కురుమయ్య, రత్న సాగర్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్

దుండిగల్: ప్రధాన రోడ్లు, వార్డుల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. ఆదివారం ఉదయం 5:30 గంటల నుంచి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు జరుగుతున్న తీరును గమనించి పలు సూచనలు చేశారు. అన్ని వార్డుల్లో స్వచ్ఛ ఆటోల ద్వారా డోర్ టు డోర్ వెళ్లి వంద శాతం చెత్తను సేకరించాలన్నారు. దుకాణాలు, హోటళ్లల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వాడకుండా నిషేధించాలని, స్పెషల్ టీమ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో పాల్గొనే పారిశుద్ధ్య సిబ్బంది తప్పనిసరిగా పీపీటీ కిట్లు, గ్లౌజ్, మాస్క్, బూట్లు ధరించాలని, రేడియం స్టిక్కర్ల జాకెట్లను ధరిస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారముండదన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, జవాన్‌లు పాల్గొన్నారు.

నందక ఐవీఎఫ్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధి జయభేరి పార్కు సమీపంలోని నందక ఐవీఎఫ్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్ దీపికరేఖ కోడూరు ఆధ్వర్యంలో ఉచితంగా స్కానింగ్, అల్ట్రాసౌండ్, సెమెన్ అనాసిస్ పరీక్షలు నిర్వహించి వైద్యులు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా దీపికరేఖ మాట్లాడుతూ.. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఉంటుందని, తమ ఐవీఎఫ్ సెంటర్‌లో వంద శాతం సక్సెస్ రేటు ఉంటుందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో చికిత్స అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనందక అడ్వాన్స్ సర్జరీ యూనిట్ చైర్మన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్లు దీప్తీరహస్య, ఉదయ్‌కిరణ్, భాస్కర్‌రెడ్డి, పూజా, సరస్వతి, హిమబిందు, జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు


బీజేపీ జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజును అభినందిస్తున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు బీజేపీలో గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆదివారం బీజేపీ డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జీడిమెట్ల డివిజన్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన జోగిని రాజుని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కష్టపడి పని చేసే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


బండి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి: వివిధ డివిజన్‌లో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. శ్మశాన వాటికను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. హౌసింగ్ బోర్డు అధికారులు ఈ స్థలం తమదంటూ ప్రహరీ నిర్మించారని దీనిపై స్థానికులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాజీవ్‌గాంధీ నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. నాలా చాలా ఇరుకుగా ఉండి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని స్థానికుల ఫిర్యాదుతో వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వెండి కవచం బహూకరణ


వెండి కవచానికి పూజలు చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నిజాంపేట్ రోడ్డులోని సెవెన్ హిల్స్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి గోదా సమేత, వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం పలువురు దాతలు స్వామివారికి రజత (వెండి) కవచాన్ని పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ఆలయ ఈవో సత్యనారాయణ చేతుల మీదుగా స్వామివారికి అందజేశారు. వేంకటేశ్వర స్వామి వారికి పీఏసీ చైర్మన్ గాంధీ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు సమర్పించిన వెండి కవచాన్ని స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం అలంకరించారు. ప్రసాద్–పద్మిని, బాలు–మంజుల, సాంబశివరావు– ఉషారాణి, ఉమశంకర్–సుజాత వెండి కవచాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజు, రాగప్రసాద్, పోతుల రాజేందర్, శ్రీహరి, పద్మ, సాంబశివారెడ్డి, అప్పిరెడ్డి, కిరణ్‌కుమార్, కడగియాల శివ, సుజాత, నిఖిల్, భక్తులు పాల్గొన్నారు.